సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను మా ప్రతినిధి ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
91829 05602
నంబర్‌లో సంప్రదించండి

అసంపూర్తి కారిడార్లతో అవస్థలు



కంచరపాలెం రైతుబజార్ వద్ద కారిడార్లు దాటుతున్న పాదచారులు



కంచరపాలెం నేతాజీ ఫ్లైఓవర్ కూడలిలో అసంపూర్తిగా వదిలేసిన కారిడార్లు

- ప్రమాదభరితంగా బీఆర్‌టీఎస్ రహదారి
- ప్రమాదాల బారిన పాదచారులు
- అదుపు తప్పుతున్న ద్విచక్ర వాహనదారులు

కంచరపాలెం: 'శీఘ్ర బస్సు రవాణా వ్యవస్థ' (బీఆర్‌టీఎస్)తో ప్రజా రవాణాలో ప్రత్యేక సంతరించుకునేందుకు, ట్రాఫిక్‌కు చెక్ పెట్టేందుకు రహదారులను నిర్మించారు. బీఆర్‌టీఎస్‌లో జెఎన్ఎన్‌ఆర్‌యూఎం బస్సుల కోసం నిర్మించిన ప్రత్యేక రహదారికి, సబ్‌వే మార్గాలకు అనుసంధానంగా కారిడార్లు ఏర్పాటు చేశారు. కంచరపాలెం కూడలి నుంచి ఎన్ఏడీ కొత్త రోడ్డు, అటు జ్ఞానాపురం కాన్వెంటు కూడలి వరకు గల బీఆర్‌టీఎస్ రహదారిలో కారిడార్లు అసంపూర్తిగా నిర్మించడంతో ప్రయాణికులకు, పాదచారులకు ఇబ్బందులు తప్పడం లేదు. నేతాజీ ఫ్లైఓవర్ కూడలి, కంచరపాలెం రైతుబజార్, ఊర్వశికూడలి, ఐటీఐ జంక్షన్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, 104 ఏరియా, మర్రిపాలెం, కరాసా ప్రాంతాల్లో కారిడార్లు విరిగి పోయి నేల కొరిగిపోవడంతో రోడ్డు దాటే పాదచారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. కారిడార్లు నుంచి బీఆర్‌టీఎస్ మార్గాన సబ్‌వేలోకి వెళ్లేటప్పుడు నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ద్విచక్ర వాహనదారులు బీఆర్‌టీఎస్ రహదారుల్లో ప్రయాణం చేసేటప్పుడు కారిడార్లు దాటే పాదచారు లు ఒక్కసారిగా రాకపోకలు సాగించే సమయంలో ప్రమాదాలకు గురవుతూ ప్రాణాలు కోల్పోతున్నారు.

మూలకు చేరిన కారిడార్లు

బీఆర్‌టీఎస్ రహదారుల్లో కారిడార్లు తుప్పుపట్టి మూలకుచేరాయి. జోన్-5 ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించిన అధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో కారిడార్లు మూలకు చేరుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో నేలకు ఒరగడంతో స్క్రాప్ దుకాణాలకు చేరుతున్నాయి. మిగిలిన కారిడార్లకు రంగులు వేస్తే కనీసం కొంత కాలం రహదారుల్లో నిలుస్తాయని చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కారిడార్లపై ప్రత్యేక దృష్టి సారించి ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని పలువురు స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

కారిడార్లు ఏర్పాటు చేయాలి

బీఆర్‌టీఎస్ రహదారుల్లో కారిడార్ల వద్ద రోడ్లు దాటేటప్పుడు పాదచారులు ప్రమాదాలకు గురవుతున్నారు. వాహదారులు అతివేగంతో బీఆర్‌టీఎస్ రహదారుల్లో ప్రయాణించేటప్పుడు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రధాన మార్గాల్లో కారిడార్లు లేకపోవడంతో ప్రజలు ఇష్టారాజ్యంగా రోడ్లు దాటుతున్నారు. ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ పోలీసులు బారికేడ్లతో సరిపెడుతున్నారు.
– ఎం.భవానిరాణి, ఐటీఐ జంక్షన్

చర్యలు చేపడతాం



బీఆర్‌టీఎస్ రహదారుల్లోని పలు ప్రాంతాల్లో టీడీఆర్‌లు తీసుకోకుండా కోర్టుకు వెళ్లడంతో రోడ్ల నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయింది. ప్రమాదకర కూడళ్లల్లో కారిడార్లు ఏర్పాటు చేశారు. ఇంజినీరింగ్ విభాగాధికారులతో మాట్లాడి అవసరమైన చోట్ల కారిడార్ల ఏర్పాట్లపై చర్యలు తీసుకుంటాం.
– ఆర్‌జీవీ కృష్ణ,జోన్-5 కమిషనర్

క్లుప్తంగా

అలరించిన కర్ణాటక గాత్ర కచేరి



కీర్తనలు ఆలపిస్తున్న గాయని శైలజ

సీతంపేట: గురువుల ఆరాధనోత్సవాల్లో భాగంగా బుధవారం లలితానగర్ లలితా పీఠంలో కర్ణాటక గాత్ర కచేరి నిర్వహించారు. ద్వారం త్యాగరాజు శిష్యురాలు అక్కినాపల్లి లక్ష్మీశైలజ అన్నమయ్య, త్యాగరాజ, ముత్తుస్వామి కీర్తనలు ఆలపించి ఆహుతులను అలరించారు. ఈమెకు సరస్వతుల పార్థివ వయోలిన్‌పై, డి.సందీప్ మృదంగంపై వాద్య సహకారం అందించారు. లలితా పీఠాధిపతి శ్రీసిద్ధేశ్వరానంద భారతి మహాస్వామి గాయని శైలజను ఆశీర్వదించారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

పఠనాసక్తిని పెంచుకోండి



కథల పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

మురళీనగర్: పుస్తకాలను చదవడంలో ఆసక్తిని పెంచుకోవాలని విద్యార్థులకు రిసోర్స్ పర్సన్ ఎం.కృష్ణారావు సూచించారు. మురళీనగర్ మహిళలు, పిల్లల గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో బుధవారం ఆయన పాల్గొని పఠనాసక్తి వల్ల కలిగే ప్రయోజనాలు తెలియజేశారు. ప్రతి పుస్తకం ఒక విజ్ఞాన నిధిలాంటిదన్నారు. గ్రంథ పఠనంతోనే మానసిక వికాసం సాధ్యమవుతుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కథల పుస్తకాలు చదివించారు. ఇండోర్ గేమ్స్‌లో భాగంగా విద్యార్థులు క్యారమ్స్ పోటీలు నిర్వహించారు. లైబ్రేరియన్ వై.పద్మజ పర్యవేక్షించారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

సీతమ్మధార: ఆశీలమెట్ట సెక్షన్ ఆఫీస్ పరిధిలో 11 కేవీ నార్త్ ఎక్స్‌టెన్షన్ లేఅవుట్, 11 కేవీ టీపీటీ కాలనీ ఫీడర్ల పరిధిలో మరమ్మతుల నిమిత్తం శుక్రవారం సాయంత్రం 4 నుంచి 5.30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని జోన్-1 ఈఈ జి.సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఎన్ఆర్ఐ హాస్పిటల్ వెనుక వైపు ప్రాంతం, హెచ్‌డీఎఫ్‌సీ రీజనల్ బ్యాంకు, టీపీటీ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

మర్రిపాలెం సెక్షన్‌లో..

మురళీనగర్: మర్రిపాలెం సెక్షన్ పరిధిలోని 104 ఏరియా, లక్ష్మీనగర్, బాపూజీనగర్ 11 కేవీ ఫీడర్ నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు జోన్-2 ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఐటీఐ కూడలి, సిద్ధార్థనగర్, 104 ఏరియా, బాపూజీనగర్, భవానీ గార్డెన్స్, శ్యామ్‌నగర్ కాలనీ, లక్ష్మీనగర్ అపార్ట్‌మెంట్ మొత్తం, గణేష్‌నగర్ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని కోరారు.

9,10 తేదీల్లో ఆటోరిక్షా కార్మిక సంఘం మహా సభలు



పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

అల్లిపురం: ఈ నెల 9,10 తేదీల్లో విశాఖపట్నం జిల్లా ఆటో రిక్షా కార్మిక సంఘం (ఏఐటీయూసీ) 4వ మహాసభలు టీఎల్ఎన్ సభా హాల్లో జరగనున్నాయని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.కె.రెహమాన్ తెలిపారు. సీపీఐ కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ 1998 నుంచి ఆటో రిక్షా కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. ఈ నేపథ్యంలో జరగనున్న మహాసభలు అత్యంత విశిష్టతను సంతరించుకున్నాయన్నారు. ప్రభుత్వాలు ఆటోడ్రైవర్లపై ఆర్థిక భారం మోపుతూ జీవో నంబర్ 21 తీసుకొచ్చాయన్నారు. ఆటో డ్రైవర్లు యాక్సిడెంట్‌కు గురై చనిపోతే రూ.10 లక్షలు, సాధారణ మరణానికి రూ.5 లక్షలు వర్తించే విధంగా ఉచిత ఇన్సూరెన్స్, పీఎఫ్, ఈఎస్ఐతో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ అదనపు కార్యదర్శి ఎం.మన్మథరావు, సీఎం రమణ తదితరులు పాల్గొన్నారు.

స్థల క్రమబద్ధీకరణకు అవకాశం



ఆర్ఐ, వీఆర్వోలు, సచివాలయ సెక్రటరీలతో సమీక్షిస్తున్న తహసీల్దార్ ఆనంద్‌కుమార్

సీతమ్మధార: జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ, వీఆర్వోలు, సచివాలయ సెక్రటరీలతో తహసీల్దార్ ఆనంద్‌కుమార్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న విధుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవో నంబర్ 84 ప్రకారం 150 గజాల లోపు స్థలం ఉన్న వారికి ఉచితంగా, 151 నుంచి 300 వరకు ప్రస్తుతం మార్కెట్ ధరపై 15 శాతం, 300 నుంచి 500 గజాల వరకు 30 శాతం , ఆ పైబడిన స్థలానికి వంద శాతం చెల్లించి క్రమబద్ధీకరించుకోవాలని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జీవో 388, యూఎల్‌సీపై తహసీల్దార్ సమీక్షించారు. ప్రతి ఒక్క అధికారి, సిబ్బందిని అడిగి వారి పనితీరు గురించి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ త్రినాథ్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్లలు లేనిది సాహిత్యం



మాట్లాడుతున్న రచయిత వరిగొండ కాంతారావు

సీతంపేట: కవులు ప్రలోభాలకు గురికాకుండా సత్యం వైపు నిలవాలని రచయిత వరిగొండ కాంతారావు(వరంగల్) పిలుపునిచ్చారు. సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ప్రిజమ్ కళాశాలలో జరిగిన కవిసమ్మేళనంలో ముఖ్య అతిథిగా ఆయన ప్రసంగించారు. సాహిత్యానికి ఎల్లలు లేవని, సాహిత్యం సర్వకాలీన, సర్వజన ఆమోదమై ఉండాలన్నారు. సభాధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ కవులు, రచయితలు మన భాష, సంస్కృతుల వికాసానికి, ఉన్నతికి కృషి చేయాలని కోరారు. కవిత్వం అందంగా, అలంకారాలతో, ఆర్ద్రతతో అందరినీ అలరించేలా ఉండాలని, మనిషి మనీషి కావడమే సాహిత్యం లక్ష్యమన్నారు. రచయిత కె.జి.వేణు ప్రముఖ కథా రచయిత డాక్టర్ కేతు విశ్వనాథరెడ్డి గురించి సభకు పరిచయం చేశారు. అనంతరం నిర్వహించిన కవి సమ్మేళనంలో చిన సూర్యనారాయణ, కె.వి.ఎస్.మూర్తి, భాగవతుల సత్యనారాయణమూర్తి, రామ, కొత్తూరి రమణ, వేదుల కామేశ్వర శర్మ, సి.ఎస్.ఎస్.కృష్ణారావు, కె.వి.ఎస్.నరసింహం కవితలు చదివి వినిపించారు.

నేడు సహస్ర తులసీదళార్చన

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవాలయంలో ప్రతి గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసీదళార్చన నిర్వహించనున్నారు. భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబర్ 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు ఆయా వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా, ఫోన్ నంబర్‌ను 89855 15989కు వాట్సాప్ చేయాలి.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

సీతమ్మధార: ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధి రైల్వే న్యూకాలనీ స్టేడియం సమీపంలోని ప్రధాన రహదారిపై బుధవారం ద్విచక్ర వాహనాలు రెండు ఢీకొట్టుకోవడంతో ముగ్గురు గాయపడ్డారు. స్థానికుల సమాచారం ఇలా.. రామ్‌నగర్‌కు చెందిన ఓ యువకుడు యువతితో కలిసి తన ద్విచక్ర వాహనంపై రైల్వే న్యూకాలనీ మీదుగా చోడవరం బయలుదేరాడు. అదే సమయంలో అటుగా మరో ద్విచక్ర వాహనంపై అతివేగంగా వస్తున్న మరో యువకుడు వీరి వాహనాన్ని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో వెనుక కూర్చున్న యువతికి గాయాలయ్యాయి. యువకులు స్వల్పంగా గాయపడ్డారున. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని క్షతగ్రాతులను ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతి



వృద్ధుడి మృతదేహం

సీతమ్మధార: ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గుర్తు తెలియని ఓ వృద్ధుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా.. 60 ఏళ్ల వయసు గల ఓ వృద్ధుడు ఆశీలమెట్ట ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద భిక్షాటన చేసుకుంటూ జీవిస్తున్నాడు. మంగళవారం అనారోగ్యంతో బాధపడుతుండగా.. చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. వృద్ధుడి మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీలో ఉంచారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 94409 04332, 63051 87009 నంబర్లలో సంప్రదించాలని సీఐ సీహెచ్.సింహాద్రినాయుడు కోరారు.

జాతీయ విద్యా విధానంపై సైకిల్ ర్యాలీ



సైకిల్ ర్యాలీలో పాల్గొన్న కేంద్రీయ విద్యాలయం విద్యార్థులు

తాటిచెట్లపాలెం: కేంద్రీయ విద్యాలయం(వాల్తేర్) ఆధ్వర్యంలో ఈ నెల 1 నుంచి 15 వరకు నూతన జాతీయ విద్యా విధానం-2020పై అవగాహన కల్పించేందుకు విద్యార్థులు ప్రత్యేక సైకిల్ ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు. కేవీ ప్రిన్సిపాల్ కమల్ జీత్ నేతృత్వంలో విద్యార్థుల బృందం ఫిజికల్ అండ్ హెల్త్ టీచర్ కె.ఎం.రియాజ్‌ఖాన్, కోచ్‌లు వి.శివ్‌గిరి, బి.రాణిలతో కలసి సైకిల్ ర్యాలీలో పాల్గొన్నారు. జీ-20 కోసం నిర్వహించిన జనభాగిదరిలో భాగంగా ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీపై అవగాహన కల్పించేందుకు ఈ ర్యాలీ చేసినట్లు స్కూల్ సిబ్బంది తెలిపారు. సమీప భవిష్యత్తులో దేశంలోని విద్యార్థులను ఉత్తమ విద్యావంతులుగా తీర్చిదిద్దడానికి ప్రజలు, తల్లిదండ్రులు తమ వంతు సహకారాన్ని అందిస్తూ, భాగస్వాములు కావాలని ఈ సైకిల్ ర్యాలీ ద్వారా తెలియజేస్తున్నారు.

సాగర సంరక్షణ సమష్టి బాధ్యత



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆచార్య రామకృష్ణారావు తదితరులు

ఏయూక్యాంపస్: మానవాళి మనుగడకు అవసరమైన ప్రాణవాయువును అధికంగా అందించే సముద్రాలను కాపాడుకుందామని కృష్ణ విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి సుంకరి రామకృష్ణారావు పిలుపునిచ్చారు. ఆంధ్రా యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ విభాగం సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన ప్రపంచ సముద్రాల పరిరక్షణ దినోత్సవంలో ఆయన మాట్లాడారు. 2050 నాటికి చేపలు, ఇతర జీవరాశి కన్నా ప్లాస్టిక్ వ్యర్థాలే సముద్రాల్లో అధికంగా ఉంటాయని ఒక సర్వేలో తేలిందని చెప్పారు. ఇటువంటి సమయంలో సముద్రాలను సంరక్షించుకోవాల్సిన బాధ్యత మానవాళిపై ఉందన్నారు. ఏయూ సైన్స్ కాలేజీ రిటైర్డ్ ప్రిన్సిపాల్ డీఈ బాబు మాట్లాడుతూ 50 శాతానికి పైగా ప్రాణవాయువును ఇచ్చే సముద్రాల పరిరక్షణను ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా స్వీకరించాలని సూచించారు. ఏయూ సివిల్ ఇంజినీరింగ్ విభాగం ఆచార్యుడు ఎస్.బాలప్రసాద్ మాట్లాడుతూ సముద్రాల పరిరక్షణపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలన్నారు. ఏయూ పర్యావరణ శాస్త్ర విశ్రాంత ఆచార్యులు ఈయూబీ రెడ్డి మాట్లాడుతూ సముద్రాల్లోకి విష రసాయనాలు, విషపూరితమైన క్రిమిసంహారాలు, భార లోహాలు వెళ్లకుండా చూడాలన్నారు. ఏయూ జాతీయ సేవా పథకం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.హరనాథ్, జీవ వైవిధ్య మండలి రీజనల్ కో ఆర్డినేటర్ జానకిరావు, సిఫా సంస్థ ప్రతినిధి డాక్టర్ శశిప్రభ, గ్రీన్ క్లైమేట్ టీం ప్రతినిధి జేవీ రత్నం తదితరులు పాల్గొన్నారు.

10న వైజాగ్ ఫిల్మ్ సొసైటీ సమావేశం

మద్దిలపాలెం: ఈ నెల 10న డాక్టర్ బుల్లయ్య కళాశాలలో వైజాగ్ ఫిల్మ్ సొసైటీ సమావేశం నిర్వహిస్తున్నామని నరవ ప్రకాశరావు ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాల గాంధీ సెంటర్ ఆవరణలో సాయంత్రం 5 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ఆచార్య ఎ.డి.పాల్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి సభ్యులందరూ హాజరు కావాలని ఆయన కోరారు. ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాలకు సంబంధించి చర్చించనున్నామన్నారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
వైజాగ్ నార్త్
9912440606
సాక్షి

షరతులు లేని వేతన ఒప్పందం చేయాలి

దాబాగార్డెన్స్: ఎటువంటి షరతులు లేని వేతన ఒప్పందం వెంటనే చేయాలని యునైటెడ్ పోర్టు అండ్ డాక్ ఎంప్లాయీస్ యూనియన్, డాక్‌వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం పోర్టు ప్రధాన గేట్ సీహార్స్ జంక్షన్ వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ కార్యదర్శి బి. జగన్ మాట్లాడుతూ ద్వైపాక్షిక వేతన సంద్రప్రదింపుల కమిటీలో యాజమాన్యం నుంచి 13 మంది, ట్రేడ్ యూనియన్ నుంచి 13 మంది ఉన్నారన్నారు. మేజర్ పోర్టులో పని చేస్తున్న కార్మికులకు ధరల పెరుగుదలకు అనుగుణంగా ఎంత జీతం ఉండాలో ఈ కమిటీ నిర్ణయం చేస్తుందని, అటువంటి కమిటీని కాదని ఐపీఏ యాజమాన్యం ఐదుగురు సభ్యులతో సబ్ కమిటీ వేయడాన్ని తప్పుపట్టారు. పోర్టు ఆస్పత్రిని పీపీపీ పద్ధతిలో ప్రైవేట్‌కు ఇవ్వడాన్ని విరమించుకోవాలన్నారు.

ఐక్య పోరాటాలతోనే విజయం



మాట్లాడుతున్న ఓబులేసు

కూర్మన్నపాలెం: కార్మిక వర్గాన్ని అణచివేసేందుకు కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు దుర్మార్గమని ఏపీ స్టేట్ ఏఐటీయూసీ జనరల్ సెక్రటరీ ఓబులేసు అన్నారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న ఉక్కు రిలే నిరాహార దీక్షల్లో 846వ రోజు బుధవారం ఆయన పాల్గొని, మాట్లాడారు. విశాఖ ఉక్కు పరిశ్రమను అమ్మాలనే అలోచన వచ్చిన మోదీ ప్రభుత్వానికి ప్రజలు గట్టిగా బుద్ధి చెప్తారన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేయడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, ఈ ప్రయత్నాలను కార్మిక వర్గం తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరిగే ఉద్యమంలో ప్రజలందరినీ భాగస్వాములు చేయాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఉక్కు పరిశ్రమను చేజార్చుకోకూడదని అన్నారు. దీక్షలో సంస్థకు చెందిన బ్లాస్ట్‌ఫార్నేస్ విభాగ కార్మికులు కూర్చున్నారు. కార్యక్రమంలో ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

సమాచారమ్

అందుబాటులో ఎంప్లాయిమెంట్ అధికారులు



ఐటీఐ జంక్షన్‌లో జిల్లా ఉపాధి కార్యాలయం

కంచరపాలెం: ఐటీఐ జంక్షన్‌లోని జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీర్ సెంటర్‌లో టెక్నికల్, క్లరికల్, జిల్లా సబ్ రీజినల్(ఎస్సీ, ఎస్టీ) విభాగాల్లో నిర్వహిస్తున్న కార్యక్రమాల వివరాల గురించి సంబంధిత అధికారులకు ఫోన్ చేసి తెలుసుకోవచ్చు. జాబ్‌మేళాలు, ఎంప్లాయిమెంట్ కార్డులు, రిజిస్ట్రేషన్, రెన్యూవల్స్‌కు సంబంధించిన సమాచారం, అనుమానాలు, సందేహాలు నివృత్తి చేసుకునేందుకు కింద పేర్కొన్న ఫోన్ నంబర్లలో జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారులను సంప్రదించవచ్చు.

జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారుల వివరాలు

అధికారి పేరు	బాధ్యత	ఫోన్ నంబర్
సిహెచ్.సుబ్బిరెడ్డి	క్లరికల్ అధికారి	83283 75788
కె.సుధ	టెక్నికల్ అధికారి	98492 31520
ఎస్.శ్యామ్‌సుందర్	సబ్ రీజనల్ అధికారి(ఎస్సీ, ఎస్టీ)	87001 57960

సైకిల్ యాత్రికుడికి సత్కారం



ప్రశాంత్‌ను సత్కరిస్తున్న ట్రస్టు సభ్యులు



సైకిల్ యాత్రలో ప్రశాంత్

కంచరపాలెం: కంచరపాలెం నుంచి నేపాల్ వరకు సైకిల్ యాత్ర చేసిన చేసిన ప్రశాంత్‌ను కంచరపాలెం దుర్గానగర్‌లోని హన్నాహ్ అనాథాశ్రమంలో ట్రస్టు సభ్యులు బుధవారం ఘనంగా సత్కరించారు. ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చిన 'బేటీ బచావో-బేటీ పడావో' అనే నినాదంతో దేశ వ్యాప్తంగా 26 రోజులు 2370 కిలో మీటర్లు సైకిల్ యాత్ర చేసినట్లు ప్రశాంత్ తెలిపారు. ముఖ్యఅతిథిగా ధాత్రి ఫౌండేషన్ చైర్మన్ సీహెచ్ విశాలక్ష్మి, ఇతర ప్రముఖులు ప్రశాంత్‌ను అభినందించారు. ఈ సందర్భంగా ధాత్రి విశాలక్ష్మి మాట్లాడుతూ సమాజంలో మహిళలపై వివక్షను అరికట్టడానికి సైకిల్ యాత్ర చేయడం ఎంతో అభినందనీయమన్నారు. సామాజిక సేవకురాలు అనురాధ స్ఫూర్తితో ఆమె కుమారుడైన ప్రశాంత్ మహిళలపై జరుగుతున్న నేరాలను నివారించాలని యాత్ర చేయడం ప్రశంసనీయమని కొనియాడారు. అనంతరం సైకిల్ యాత్ర విజయోత్సవ కేక్‌ను ప్రశాంత్ కట్ చేసి అనాథ పిల్లలకు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ అనురాధ, సభ్యులు ఆనందరావు, శ్రీనివాసరావు, అర్జున్, సురేష్, హోమ్ చిన్నారులు పాల్గొన్నారు.

బయో ఇన్నోవేషన్ ప్రోగ్రాంకు విద్యార్థుల ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ఆచార్యులు

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆ హబ్, మేధో సంపత్తి విభాగం, ది సెంటర్ ఫర్ అడ్వాన్స్‌డ్ అప్లయిడ్ బయాలాజికల్ సైన్సెస్- ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్(టీ క్యాబ్స్-ఇ) సంయుక్తంగా నిర్వహిస్తున్న బయో ఇన్నోవేషన్ ప్రోగ్రాం-2023కు బుధవారం విద్యార్థుల ఎంపిక ప్రక్రియ నిర్వహించారు. వర్సిటీలోని పలు విభాగాలకు చెందిన విద్యార్థులను మౌఖిక పరీక్షల ద్వారా ఈ కార్యక్రమానికి ఎంపిక చేశారు. వర్సిటీ విద్యార్థులు అలేఖ్యా అధికారి, నిఖిల్ చెన్ను, మహాలక్ష్మి వోలేటి, మోనాలిసా చౌదరి, మునీషా కుసుమే, పూర్ణిమ మల్లూరి, ప్రత్యూష సారవు, సునీత గంట ఎంపికయ్యారు. టీ క్యాబ్స్ -ఇ వ్యవస్థాపకుడు డాక్టర్ రవికిరణ్ యేడిది, ఐపీఆర్ చైర్ డాక్టర్ హనుమంతు పురుషోత్తం, ఆ హబ్ సీఈవో రవి ఈశ్వరపు ఈ కార్యక్రమం నిర్వహించారు. ఎంపికై న విద్యార్థులను అధికారులు అభినందించారు.

సామాజిక మాధ్యమాల భూమిక కీలకం



సిరాజ్ ఉర్ రెహమాన్‌ను సత్కరిస్తున్న డాక్టర్ చల్లా రామకృష్ణ

ఏయూక్యాంపస్: మత సామరస్యం, ప్రపంచ శాంతిని పెంపొందించడంలో సామాజిక మాధ్యమాల భూమిక ఎంతో కీలకమని పీస్ మెసేజ్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు సిరాజ్ ఉర్ రెహమాన్ అన్నారు. సామాజిక మాధ్యమాల్లో మత విద్వేషాలను ఎదుర్కోవడం అంశంపై ఏయూ గాంధీ అధ్యయన కేంద్రం, సెంటర్ ఫర్ ఎమోషనల్ ఎడ్యుకేషన్ సంయుక్తంగా బుధవారం నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆయన ప్రసంగించారు. అసత్య ప్రచారం, ద్వేషాన్ని రెచ్చగొట్టే వ్యాఖ్యలను ఖండించాల్సిన అవసరం ఉందన్నారు. గాంధీ అధ్యయన కేంద్రం సంచాలకుడు ఆచార్య చల్లా రామకృష్ణ మాట్లాడుతూ దేశ సమగ్రాభివృద్ధికి ఐక్యతే సాధనంగా నిలుస్తుందన్నారు. వివిధ మతాల మధ్య ఉన్న సారూప్యతలను ప్రచారం చేయడం, మత సహనాన్ని పెంపొందించడానికి దోహదపడుతుందన్నారు. సెంటర్ ఫర్ ఎమోషనల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణవీర్ అభిషేక్ సామాజిక మాధ్యమాల్లో వస్తున్న నూతన విధానాలను వివరించారు. ఈ సందర్భంగా సిరాజ్‌ను కేంద్రం తరఫున డాక్టర్ చల్లా రామకృష్ణ సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ పి.కిషోర్, సుఫీ నద్వీ, కె.సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

సీఐటీఎస్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

పెదగంట్యాడ: స్థానిక ప్రభుత్వ ఐటీఐలోని ఇన్‌స్టిట్యూట్ ఫర్ ట్రెనింగ్ ఆఫ్ ట్రెనర్స్ (ఐటీఓటీ) ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, వెల్డర్ ట్రేడుల్లో 2023-24 సంవత్సరానికి గాను క్రాఫ్ట్ ఇన్‌స్ట్రక్టర్ ట్రెనింగ్ స్కీమ్ (సీఐటీఎస్)లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఐటీఐ ప్రిన్సిపాల్ కె.ఎస్. శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఈ నెల 17లోగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. వీరికి వచ్చే నెల 8న ఆన్‌లైన్‌లో ఆలిండియా కామన్ ఎంట్రన్స్ టెస్ట్, కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) ఉంటుందని పేర్కొన్నారు. ఈ శిక్షణ కోసం ఐటీఐ అప్రెంటిస్ పాసైన అభ్యర్థులు, డిప్లొమా, డిగ్రీ పాసైన వారు అర్హులని తెలిపారు. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, వెల్డర్‌లో 25 సీట్లు చొప్పున భర్తీ చేయనున్నట్లు తెలియజేశారు. www.nimionlineadmission.in ద్వారా దరఖాస్తు చేయాలని సూచించారు.

కల్యాణం.. కమనీయం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్య కల్యాణం విశేషంగా జరిగింది.ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను మండపంలోని వేదికపై అధిష్టంపజేశారు. ఉదయం 9.30 గంటల నుంచి విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వైజాగ్ నార్త్
9010810033
Office mail : sakshiadvtvsp@gmail.com